కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- సుండుపల్లె

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ వృత్తి ఎంపిక ప్రదర్శనలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు తమ భవిష్యత్తు ఎలా ఉండాలి అనే లక్ష్యంతో ఉత్తమ నైపుణ్యాలైన డాక్టర్, ఇంజినీర్, రైతు, పైలట్, చెప్, పోలీస్ వంటి వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు ఆరు ప్రధాన కేటగిరీలలో నిర్వహించారు అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిట్ ప్రదర్శనను చేపట్టారు. డ్రాయింగ్ కాంపిటీషన్‌లో విద్యార్థులు తమ నైపుణ్యాలను చాటారు. సంబంధిత కేటగిరీలలో జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు బి.వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.నాగార్జున, ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధికారులు

కష్టాల్లో కమ్యూనిటీ హెల్త్

- తొలగని స్పెషలిస్టు వైద్యుల కొరత
- 233 మంది వైద్యులకు గానూ 163 మందే
- సామాన్య రోగుల దరిచేరని కమ్యూనిటీ హెల్త్ సేవలు

జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ హాస్పిటళ్లు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. జిల్లాలో పెరుగుతున్న రోగులకు అనుగుణంగా వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ప్రభుత్వం ఏడాది కిందటి నుంచి జిల్లాల వారీగా వైద్య సేవలను అంచనా వేయడానికి ఉద్దేశించిన గ్రేడ్ల ఆధారిత వ్యవస్థను ఎత్తేసింది. ఎక్కువ సర్జరీలు, ఒపి, ఐపి సేవలు, దిగువ భాగాన ఫలానా జిల్లాలు ఉన్నాయనే పేరిట రివ్యూ చేయడం జరుగుతోంది. గ్రేడింగ్ సిస్టమ్ లేకపోవడంతో పోటీతత్వం కొరవడడంపై వైద్య ఆరోగ్య శాఖ అధికార వర్గాల్లో ఉత్సాహం కొరవడింది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల పనితీరు మందగించింది. స్పెషలిస్టు, సాధారణ వైద్యుల కొరత నెలకొనడంతో వైద్య సేవల్లో మెరుగుదల కొరవడింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో కమ్యూనిటీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కొరవడింది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, వేంపల్లి, పోరుమామిళ్ల, మైదుకూరు, చెన్నూరు, కమలాపురం, సిద్ధవటం, రాజంపేట, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు ప్రాంతాల్లో డిసిహెచ్ఎస్ ఆస్పత్రులు ఉన్నాయి. కడప జిల్లా పరిధిలోని ఏడు డిసిహెచ్ఎస్ ఆస్పత్రుల్లో ప్రతినెలా సగటున రూ.1.13 లక్షల మంది ఒపి, 12 వేల మందికిపైగా ఐపి సేవలు పొందుతున్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఆస్పత్రుల పనితీరుకు సంబంధించిన గ్రేడి ంగ్ వ్యవస్థను ఎత్తే యడం, వైద్యుల నియామకాలపై దృష్టి సారించక పోవడం, టిఫాస్కాన్ వంటి ఆధునిక డయాగ్నోస్టిక్ వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం, వైద్యుల్లో జవాబుదారీతనం కొరవడిందనే విమర్శలు ఉన్నాయి. మైదుకూరు, జమ్మలమడుగు ఆస్పత్రుల అప్‌గ్రెడేషన్‌కు స్థలాల కేటాయింపులకు అడ్డంకులు తలెత్తడం వంటి అనేక కారణాలతో సామాన్యులకు కమ్యూనిటీ హెల్త్ సేవలు అంతంతమాత్రంగానే కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

163 మందితోనే వైద్య సేవలు

ఉమ్మడి జిల్లాలోని 13 డిసిహెచ్ ఆస్పత్రులకు 233 మంది వైద్యులు సేవలు అందించాల్సి ఉంది. డిసిహెచ్ఎస్ వైద్య ఆరోగ్య శాఖ 163 మంది వైద్యులతోనే వైద్యసేవలు అందించడానికి తంటాలు పడుతోంది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల, బద్వేల్, వేంపల్లి డిసిహెచ్ఎస్ ఆస్పత్రులు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించిన దాఖలాల్లేవు. పోరుమామిళ్లలో 15 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఎన్నడూ ఆరు నుంచి తొమ్మిది మంది వైద్యులను భర్తీ చేసిన దాఖలాల్లేవు. ఆస్పత్రికి పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల నుంచి వందలాది మంది సామాన్య రోగులు పెద్దఎత్తున ఒపి, ఐపి సేవలకు వస్తుంటారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థో తదితర విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు కొరవడిన ఫలితంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేదేమీ లేకపోవడంతో కడప, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు రోగులు పరుగులు పెడుతున్నారు.

మంత్రి సొంత జిల్లాలో అవస్థలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సొంత జిల్లాలోని సామాన్య రోగులకు అవస్థలు తప్పడం లేదు. వైద్యుల కొరత మొదలుకుని మైదుకూరు, జమ్మలమడుగు డిసిహెచ్ ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్‌కు స్థలాల కొరత ఏర్పడడం, స్థలాల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలుపై దృష్టి సారించాలనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి అడ్డంకులను పరిష్కరించడం మరిచి, ఎంతసేపూ పిపిపి పేరిట మెడికల్ కళాశాలల అమ్మకం పట్ల ఉన్న శ్రద్ధ సొంత జిల్లా ఆరోగ్య పరిస్థితులపై లేదనే విమర్శలు ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు టిఫాస్కాన్ యంత్రాల మంజూరు నేపథ్యంలో ఏపారామీటర్ ప్రకారం కేటాయింపులు చేసి నప్పటికీ మంత్రి సొంత జిల్లాకు కేటాయింపులు ప్రస్తావన లేకపోవడం ఏమిటనే అంశం ప్రస్తావనకు వస్తోంది. ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ హెల్త్ ఆస్పత్రుల అప్‌గ్రెడేషన్, వైద్య నిపుణుల నియామకం, స్థలాల సమస్య పరిష్కారం, ఆస్పత్రుల మానిటరింగ్ వంటి అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్య నియామకాలపై దృష్టి పెట్టాం

ఉమ్మడి కడప జిల్లాలోని డిసిహెచ్ ఆస్పత్రుల వైద్యుల కొరతను భర్తీ చేయడంపై దృష్టి సారించాం. గత వారంలో 10 మంది స్పెషలిస్టు వైద్యులను నియమించాం. భవిష్యత్‌లో మిగిలిన పోస్టులను భర్తీ చేస్తాం.

- డాక్టర్ వై.హిమదేవి, డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్, కడప.

మోసపూరిత ఏజెంట్లపై కఠిన చర్యలు

- కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్

పాస్‌పోర్టు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఐజి ప్రవీణ్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా ప్రజల సౌకర్యార్థం పోలీసు శాఖ మరో ముంద డుగు వేసింది. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లితో కలిసి బుధవారం పాస్‌పోర్ట్ ఫిర్యాదుల పరిష్కారం, వలసదారుల సౌకర్య కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా నుంచి ఉపాధి కోసం, ఉన్నత చదువుల కోసం గల్ఫ్ దేశాలకు, ఇతర విదేశాలకు వెళ్లే వారి సంఖ్య చాలా ఎక్కువని తెలిపారు. పాస్ పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియలో తలెత్తే సాంకేతిక సమస్యల వల్ల సామాన్యులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పారద ర్శకమైన సేవలు అందించడమే కాకుండా, విదేశాల్లో ఇబ్బందులు పడే వలస కార్మికులకు ఈ కేంద్రం ఒక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. జిల్లా ప్రజలు పాస్‌పోర్ట్ సమస్యల కోసం ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ ప్రత్యేక కేంద్రం ద్వారా పాస్‌పోర్ట్ దరఖాస్తుల పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఏజెంట్ల చేతిలో మోస పోయిన వలసదారులు లేదా విదేశాల్లో చిక్కుకుపోయిన వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చని ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షించి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్విని యోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎం.వెంక టాద్రి, రాయచోటి డిఎస్‌పి ఎం.ఆర్.కృష్ణమోహన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేష్, పి.వెంకటేశ్వర్లు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు : డిఆర్ఒ

మాట్లాడుతున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి-రాయచోటి

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం డైట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, తప్పుదోవపట్టించే ప్రకటనలు, లోపభూయిష్ట ఉత్పత్తుల నుండి రక్షణ కల్పించడం, ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించడం వినియోగదారుల సంరక్షణ చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఏడాది జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన పరిష్కారమనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామని చెప్పారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమయం ఆదా కావడమే కాకుండా వేగవంతంగా న్యాయం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వై.సుమతి మాట్లాడుతూ తూకాల్లో మోసం జరిగినా, నాణ్యతలేని వస్తువులు విక్రయించినా, రైల్వే, విమానయానం, విద్యుత్, గ్యాస్, కొరియర్ సేవలు, ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ వ్యాపారాల్లో లోపాలు ఎదురైనా సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా వినియోగదారుల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తోందని తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా కమిషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర కమిషన్, జాతీయ స్థాయిలో జాతీయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే వినియోగదారుల హక్కులు, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌ల ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో వినియోగదారుల ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ఆంగ్లం, తెలుగు మీడియం వారీగా ప్రథమ బహుమతికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతికి రూ.3 వేలు, తృతీయ బహుమతికి రూ.2 వేలు చొప్పున మొత్తం 40 వేలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి శోభలత, జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ దివ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీంబాషా, రాయచోటి జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ, మదనపల్లి జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి, జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారుల పనులను వేగవంతం చేయండి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

రహదారుల పనులు వేగవంతంగా, ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, నీటిపారుదల శాఖ, జాతీయ రహదారులు, డ్వామా తదితర ఇంజినీరింగ్ శాఖల పనుల పురోగతిపై జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, నాబార్డ్, తదితర నిధులతో చేపడుతున్న రహదారుల పనులను వేగవంతం చేయాలని గ్రామీణ రహదారులను మండల రహదారులకు మండల రహదారులను డివిజన్ స్థాయి రహదారులకు డివిజన్ స్థాయి రహదారులను జిల్లా స్థాయి రహదారులకు కలిపే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. రహదారుల పనులు పూర్తి చేసేటప్పుడు ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా చూసుకోవాలని సూచించారు. పల్లెపండుగ కార్యక్రమాలలో జరిగే పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ తదితర ప్రాజెక్టులను కాలపరిమితితో పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో 3079 పనులలో 2615 పనులు పూర్తి చేశారని మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 18 మండలాలలో 3075 ప్రాంతాలకు నీటి సరఫరా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో వివిధ నియోజకవర్గాలలో చేపడుతున్న 75 పనులలో 30 పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 207 పనులలో మొత్తం 50 పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల పనులపై సమీక్షిస్తూ రాయచోటి నుండి వేంపల్లి వరకు ఎన్‌హెచ్ 440 రహదారిపై పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్‌హెచ్ 40, ఎన్‌హెచ్ 440 రహదారులపై రాయచోటి బైపాస్ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాజంపేట, మదనపల్లి, రాయచోటి డివిజన్‌లో డ్వామా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చిన్న తరహా నీటి పారుదల పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా శాఖల డివిజన్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

రైతు పండించిన పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు వీలు కల్పించేందుకే రైతు బజారు నిర్మించనున్నట్లు ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. బుధవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఎఎంసి కార్యదర్శి హరినాథ్ అధ్యక్షతన పాలకమండలి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు, రైతులు తాము పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవడానికి అనుకూలంగా రూ.1.36 కోట్ల వ్యయంతో రైతు బజారు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పైఅధికారులకు ప్రతిపాదనలు పంపించామని త్వరలో రైతు బజార్, రైతు మార్కెట్ యార్డ్ ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పి.సురేంద్ర రెడ్డి, డైరెక్టర్లు ఎన్, అమర్నాథ్ రెడ్డి, కలప రవి, గోళ్ళ కిషోర్ నాయుడు, ఎన్.సుబ్బయ్య, పి.రహమతుల్లా, ఎం.సాధన, లక్ష్మీకాంతమ్మ, జి.అనురాధ, ఒ.రమాదేవి, ఎ.అనిత, ఎం.రజనిశ్రీ, ఎస్.శివమ్మ, ఎం.కృష్ణమూర్తి, మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ జి.భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా విద్యార్థులు హర్షప్రియ, వినయ్ రూపొందించిన ప్రాజెక్ట్ సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక అయినట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23,24 తేదీలలో రెండు రోజులపాటు విజయవాడలోని మురళి రిసార్ట్‌లో రాష్ట్రస్థాయి సైన్స్ పెయిర్ నిర్వహించారన్నారు. అన్ని జిల్లాల నుండి 286 ప్రాజె క్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ప్రదర్శించారని చెప్పారు. సుండుపల్లి మండలం తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హర్షప్రియ, వినయ్ రూపొం దించిన 'త్రీడీ ఆకారాలను అవగాహన చేసుకుని వినియోగించడం' అనే ప్రాజెక్టు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైందని ఆయన తెలిపారు. జనవరిలో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారన్నారు. వీరికి ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి మెమెంటో, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. గణిత ఉపాధ్యాయుడు పద్మరాజు అశోక్ రాజు వీరికి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే సుబ్రమణ్యం, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ అనురాధ, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేవులూరి చంద్రశేఖర్ విద్యార్థులను, గైడ్ టీచర్‌ను అభినందించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ వెంకటరెడ్డి

'మిట్స్'తో వూల్లెమియా ఇన్ఫోసిక్ ఎంఒయు

ప్రజాశక్తి -మదనపల్లె టౌన్

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగం, మిట్స్ ఐఐఐసి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన వూల్లెమియా ఇన్ఫోసిక్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థతో పరిశ్రమ, విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. ఈ సందర్భంగా వూల్లెమియా ఇన్ఫోసిక్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ చరణ్ గుడివాడ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ ఎంఒయుపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో చరణ్ గుడివాడ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక ప్రపంచంలో సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ వ్యవస్థల నిర్మాణానికి కృత్రిమ మేధస్సుతో కూడిన సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు అనివార్యమని పేర్కొన్నారు. ఎఐ ఆధారిత సెక్యూరిటీ వ్యవస్థలు భారీ నెట్‌వర్క్‌లు, యూజర్ డేటాను వేగంగా విశ్లేషించి అనుమానాస్పద కార్యక లాపాలను తక్షణమే గుర్తించగలవని పేర్కొన్నారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా గత దాడుల నుంచి నేర్చుకుని ఫిషింగ్, మాల్వేర్, ర్యాన్స మ్‌వేర్, జీరో-డే అటాక్స్ వంటి కొత్త తరహా బెదిరింపులను ముందుగానే గుర్తించి నివారించడంలో ఎఐ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. సైబర్ సెక్యూరిటీలో ఎఐ నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన ఆధునిక నైపుణ్యాలు అభివృద్ధి కావడంతో పాటు విస్తృత ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్లు (ఎస్ఒసి), క్లౌడ్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, డిజిటల్ ఫోరెన్సిక్స్ వంటి రంగాల్లో ఎఐ ప్రాధాన్యతను ఆయన వివరించారు. డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, అకడమిక్ ప్రాజెక్టులు, ప్లేస్‌మెంట్ ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫర్‌లలో అవకాశాలు కల్పించి, వారి విద్యా, వృత్తిపరమైన వృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యమని అన్నారు. అకడమియా, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌లో విద్యార్థులకు అత్యాధునిక పరిజ్ఞానం అందించడంలో ఈ ఎంఒయు కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పద్మ, కో-ఆర్డినేటర్ షాయాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఇఒ గుడివాడ చరణ్

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని గొల్లపల్లి శేషసాయి కల్యాణ మండపం సమీపంలోని ఎస్‌సి కాలనీలో రూ.14 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు. రూ.25 లక్షలతో ఎస్‌సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, దీనిని ఓర్వలేని వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గం అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్ ప్రసాద్ బాబు, టిడిపి నాయకులు జంగాల వెంకటరమణ, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబెల్లి వెంకట రమణారెడ్డి, శ్రీరామ సహదేవ నాయుడు, కొప్పల హరినాథ్, తమ్మిశెట్టి రామకృష్ణ, బీదం గురునాథ్ యాదవ్, ఇంతియాజ్, బాబ్జి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యునాని వైద్య కళాశాలను కొనసాగించాలి

- కలెక్టర్‌కు ఆయుష్, యునాని వైద్యుల వినతి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లాకు మంజూరైన యూనాని మెడికల్ కళాశాలను ప్రొద్దుటూరుకు తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని పున:పరిశీలించాలని రాయచోటికి చెందిన ఆయుష్, యునాని వైద్యులు, ఉర్దూ విద్యార్థులు కోరారు. బుధవారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రెండు నెలల క్రితం రాయచోటికి యునాని మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో కళాశాలకు అవసరైన 10 ఎకరాల భూమిని కూడా సర్వే చేయించారని పేర్కొన్నారు. అకస్మాత్తుగా ప్రభుత్వం యూనాని కళాశాలను ప్రొద్దుటూరుకు తరలిస్తూ జిఒను జారీ చేయడంతో రాయచోటి వాసులు ఆందోళనకు గురవుతున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 15 వేల మందికి పైగా ఉర్దూ మాధ్యమాన్ని విద్యార్థులు అభ్యసిస్తున్నట్లు తెలిపారు. యునాని వైద్యవిద్యకు ఉర్దూ ప్రధాన అర్హత సబ్జెక్టు కావడం వలన రాయచోటి పరిసర ప్రాంతాలు యునాని మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. రాయచోటిలో ఎక్కువగా ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు ఉండడం యూనాని కళాశాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. యునాని మెడికల్ కళాశాల రాయచోటిలో కొనసాగితే ఉర్దూ విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ఉర్దూ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే యునాని ఉర్దూ మెడికల్ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా చూడాలంటూ కలెక్టర్‌ను కోరారు. ఇందుకు కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందిస్తూ యునాని మెడికల్ కళాశాల తరలింపు అంశంపై విచారించి నివేదికను ప్రభుత్వానికి పంపుతానంటూ చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యునాని వైద్యులు జక్రియా అహమ్మద్, బాబ్జి, ఇర్ఫాన్‌అలీ, ముక్రంబాష, ఆల్‌మేవా జిల్లా కార్యదర్శి అసదుల్లాబాష, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్.కె.హుస్సేన్, సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోటివద్యుల ఆఫ్తాబ్, అమీర్‌అలీతో పాటు పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందచేస్తున్న యునాని వైద్యులు

మర్పూరి సుధాకర్ నాయుడిని కలిసిన ఖాదర్‌ఖాన్

సీనియర్ నాయకులను కలిసిన పఠాన్ ఖాదర్‌ఖాన్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె టిడిపి నాయకులు పఠాన్‌ఖాదర్‌ఖాన్ రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం పట్టణంలోని పలు సీనియర్ల టిడిపి నాయకులను కలుసుకున్నారు. ఇందులో సొసైటీ కాలనీలోని మర్పూరి సుధాకర్ నాయుడు, రాటకొండ బాబురెడ్డి, రాటకొండ గురుప్రసాద్‌ను కలిసి తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఖాదర్ ఖాన్ తెలిపారు. సర్పంచ్‌గా, సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా, హజ్ కమిటీ మెంబర్‌గా పని చేసిన అనుభవం ఖాదర్ ఖానకు ఉంది.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కెరియర్ ఎక్స్‌పో ఉద్యోగ ప్రదర్శన కెరియర్ పేరుపై విద్యార్థులకు మండల స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విద్యార్థులకు డాక్టర్, ఐఎఎస్, ఇంజినీర్, ఆదర్శ రైతు, పోలీస్, పైలెట్, వంట మనిషి వాటిపై ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బి.కొత్తకోట ఆదర్శ పాఠశాల నుండి నలుగురు బాలికలు మండల స్థాయిలో ఎంపికయ్యారు. 27వ తేదీ జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లిషానందిని అభినందించారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

కూలీలకు పనులు చూపాలి : ఎపిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో కూలీలు కోరిన వెంటనే పనులు చూపాలని ఎపిఒ అంజనప్ప తెలిపారు. బుధవారం శ్రీశక్తి భవన్లో ఉపాధి హామీ మండల్, మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు పనులు చూపి ఎక్కువ సంఖ్యలో కూలీలు పాల్గొనే విధంగా చొరవ చూపాలన్నారు. రైతులకు ఉపయోగకరమైన పనులు జరిగే విధంగా చూడాలన్నారు. జరిగిన పనులకు వెంటనే కొలతలు తీసి వారికి చెల్లించేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఇంజినీర్ మహేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఇ సోమశేఖర్‌రెడ్డి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్ఇ

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ జిల్లా అధికారి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్ సమస్యలను అడిగి తక్షణం వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఇక్కడ పరిస్థితి ప్రతి నెల రెండో శనివారం మరమ్మతు నిమిత్తం విద్యుత్ అంతరాయం జరుగుతున్నప్పటికీ మిగిలిన రోజుల్లో కూడా విద్యుత్ అంతరాయం వచ్చినా దానిపై సమాచారం పూర్తి స్థాయిలో స్థానిక సబ్ స్టేషన్‌లో అందడం లేదని విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యలు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖలో స్థానికంగా జరుగుతున్న పలు సమస్యలను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని పలువురు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు ఎస్ఇ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డిఇ రాజశేఖర్‌రెడ్డి, ఎడి మురళీధర్ రెడ్డి, ఎఇ వెంకటాచలపతి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.75 వేల సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని సీతారాంపేట ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఐడిబిఐ బ్యాంకు వారు రూ.75 వేలు విలువచేసే సామగ్రిని పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డిఇఒనాగయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో రాజంపేట బ్యాంక్ మేనేజర్ ప్రకాష్, ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమల రావు, గ్రామ పెద్దలు, ఎంఆర్‌సి సిబ్బంది, ప్రధానోపాధ్యాయిని మాధవి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-పీలేరు

రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు అన్నారు. బుధవారం పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక తిరుపతి రోడ్డులోని లయన్స్ భవన్ ఆవరణంలో స్విమ్స్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో క్లబ్ అధ్యక్షులు నాగబాలాజీ, సభ్యులు వెంకట సురేష్, శ్రీనివాసులు రెడ్డి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సిఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, చైతన్య కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ఒకరికి ప్రాణదానం ఇస్తుందన్నారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా మొత్తం 48 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో, కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి, మహేష్, శశిధర్ రెడ్డి, పురం బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : ఎంపీ

మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. బుధవారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలిసి ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు కుప్పం మీద ఉన్న ప్రేమ తంబళ్లపల్లి నియోజకవర్గంపై లేదని, హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు అనంతరం నియోజకవర్గంలో చెరువులకు నింపాలని కోరారు. ముదివేడు రిజర్వాయర్ పనులను మీరే పూర్తిచేయాలని, అధికారం మీ చేతుల్లోనే ఉందని తంబళ్లపల్లి నియోజకవర్గం ఆంధ్రాలో ఉందని గుర్తించాలని తెలుగుదేశం పార్టీ నేతలను హితవు పలికారు. నియోజకవర్గంలో తాగునీరు నిలువ ఉంచుటకు ముదివేడు రిజర్వాయర్ పనులను మేము చేపడితే తెలుగుదేశం పార్టీ వాళ్లు కోర్టులో పిటిషన్ వేసి ఆ పనులను నిలిపివేసి నిర్వాసితులకు మేమే డబ్బులు కట్టాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజంపేట పార్లమెంట్ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ప్రజల పక్షాన వైసిపి పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రాధా ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి హరి, వైస్ ఎంపిపి ఖాదర్‌వల్లి, వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, పేటీఎం బూత్ కమిటీ అధ్యక్షుడు కె.మంజునాథరెడ్డి, ఎంపిపి మహమ్మద్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, ఎంపిటిసి నాగార్జునరెడ్డి, కంచి కోదండ, శ్రీవర్ధ శంకర్‌రెడ్డి, నాయకులు గుమ్మడియాలు చాంద్‌బాషా, సద్దాం, నక్క సంతోష్, బావజాన్, సాయి, బోయవీధి మంజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితా పునరుద్ధరణకు కృషి చేయండి

వాల్మీకులు 60 సంవత్సరాల నుండి ఎస్‌టి పునర్దరణ కోసం పోరాటం చేస్తున్నామని అయినప్పటికీ న్యాయం జరగలేదని వాల్మీకులు ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు పార్లమెంటులో గళం వినిపించాలని ఎంపీ మిథున్‌రెడ్డికి వాల్మీకి నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గత పాలకులు వారి మేనిఫెస్టోలో కూడా వాల్మీకి ఎస్‌టి అంశం పునరుద్దరణ చేస్తామని హామీలు ఇస్తున్నారన్నారు. వాల్మీకులను పునరుద్దరణ కోసం ఎస్‌టి జాబితా పునరుద్దరణకై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తూ ప్రయివేట్ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల వాల్మీకి సంఘం నాయకులు సిరిగిరి సుధాకర్, కాల్వపల్లి జయచంద్ర, లోడర్ అంజన్న, తరారి మంజునాథ్, నక్క సంతోష్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

తంబళ్లపల్లె : మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీకి చెందిన రైతు నరసింహారెడ్డి రైతుల సమస్యల విషయమై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు విన్నవించుకున్నారు. బి.కొత్తకోట ఎంపిడిఒ కార్యాలయంలో వారు నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించిన విషయం తెలిసిందే. వర్షాలు ఎక్కువై పంటలు దెబ్బతిన్నాయని, అరకొరా పండిన పంటలకు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయామని పేర్కొన్నారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అన్నారు. బుధవారం ఓబులవారిపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పర్యటించిన బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులను వారి ఇంటి దగ్గరకు వెళ్లి పంపిణీ చేశారు. ముక్కావారిపల్లి పంచాయతీ పరిధిలోని సిఎం బలిజపల్లికి చెందిన ఎలిశెట్టి ఈశ్వరమ్మకి రూ.41 వేలు, కొర్లకుంట అరుంధ తివాడకు చెందిన అందే శివాజీకి రూ.1,00,500, మంగంపేటకు చెందిన పాశం చిన్న పీరయ్యకి రూ.42,450, మంగంపేటకు చెందిన గూటిపల్లి సహదేవుడికి రూ.1,17,969, గోవిందంపల్లి పంచాయతీ పోలివాండ్లపల్లికి చెందిన గుంద్రాటి సుబ్బరాయుడుకు రూ.30,798, మారావారిపల్లి అరుంధ తివాడకు చెందిన తాళ్లపాక వెంకటరమణకు రూ.20,614, పెద్ద ఓరంపాడు పంచాయతీ పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింత యశ్వంత్‌కి రూ.66,300, పి.కమ్మపల్లి గ్రామానికి చెందిన కిల్లరి చిన్నమ్మకు రూ.89,516, చిన్న ఓరంపాడు క్రాస్‌కి చెందిన కాపెర్ల అమరావతికి రూ.1,07,241, ముక్కావారిపల్లి పంచాయతీ తురకపల్లికి చెందిన షేక్ రహమతుల్లాకు రూ.50,500, ఓబులవారిపల్లెకు చెందిన ఎర్రగుంట వెంకట్‌రెడ్డికి రూ.85 వేలు, కటికంవారిపల్లి గ్రామానికి చెందిన కటికం లక్ష్మమ్మ రూ.79,034, కటికంవారిపల్లి గ్రామానికి చెందిన కటికం భరత్‌కి రూ.31,218, జె.వడ్డిపల్లి గ్రామానికి చెందిన పుల్లగంటి ఎల్లయ్యకు రూ.62,038, ముదినేపల్లి గ్రామానికి చెందిన పుంజనబోయిన సుబ్బమ్మకి రూ.25,041, చెన్నరాజుపడు పంచాయితీపల్లి గ్రామానికి చెందిన పుల్లగంటి సుబ్బమ్మకు రూ.43,836, చెన్నరాజుపాడు పంచాయతీ జి.వడ్డిపల్లి గ్రామానికి చెందిన పుల్లగంటి వేణుగోపాల్‌కు రూ.24,041 చెక్కులను ఇంటి దగ్గరే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు ప్రభుత్వం అండగా నిలుతుందని అవసరంలో ఉన్న అర్హులైన కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ ఇబ్బంది పడుతూ అప్పులు చేసుకొని హాస్పిటల్‌లో చూపించుకున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఒక భరోసాగా నిలుస్తుందని అవసరంలో ఉన్న వారికి ప్రభుత్వం సహాయం చేరేలా ముందుంటామని పేర్కొన్నారు.

బాధితుడికి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

జిల్లా కేంద్రం కోసం న్యాయవాదుల ర్యాలీ

రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లాగా ప్రకటించాలని కోరుతూ బుధవారం కోర్టు ప్రాంగణం నుంచి మార్కెట్ మీదుగా పాత బస్టాండ్, ఆర్ఎస్ రోడ్డు నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు న్యాయవాదులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రోడ్లపై పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ పార్లమెంట్ కేంద్రమైన రాజంపేట జిల్లా కేంద్ర కావడానికి అన్ని వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రైల్వే, విమాన, జాతీయ రహదారుల సౌకర్యం, తాగునీరు, ప్రభుత్వ కార్యాలయాలకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదానికి రాజంపేట, రైల్వేకోడూరు ప్రజలకు తీవ్ర అన్యాయం వాటిల్లిందని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాంత ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగానే న్యాయవాదులు, విద్యార్థులతో కలిసి పాత బస్టాండ్ వద్ద మానవహారాన్ని చేపట్టారు. పాత బస్టాండు కూడలిలో 15 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపి అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి సబ్ కలెక్టర్ భావనకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంతు నాయుడు, న్యాయవాదులు, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, జెఎసి నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ బుధవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఒకరోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు 11 రోజులుగా ఇ జెఎసి, జెఎసి ఆధ్వర్యంలో రాజంపేట జిల్లా సాధన కోసం రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహిస్తున్నారు అందులో భాగంగా వారికి సంఘీభావంగా జర్నలిస్టులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రయివేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులు, విభిన్న ప్రతిభావంతులు, జెఎసి నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే జర్నలిస్టులు జిల్లా సాధన కోసం తాము సైతం అంటూ చేపట్టడం హర్షించదగ్గ విషయమని జెఎసి నాయకులు అన్నారు. జర్నలిస్టులు రమేష్, వేణుగోపాల్ చౌదరి, సునీల్, సుదర్శన శర్మ, పంద్ర ప్రసాద్, నాగేంద్ర, భాస్కర్ రాజు, రవి రెడ్డయ్య, వల్లి, ఎం.ప్రసాద్, నరసింహ, పి వెంకటేష్, వి సుబ్రహ్మణ్యం, సుబ్బారావు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఇ జెఎసి నాయకులు, ప్రయివేట్ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపల్, కరస్పాండెంట్‌లు ముత్యాల పెంచలయ్య ఎస్.ఎన్. శ్రీనివాసులు ఎం.వి.కుమార్, కె.చంగల్‌రాజు, డాక్టర్ ప్రదీప్, మదన్, నరసింహారెడ్డి, సుకుమార్, గోపీనాథ్, ఎం. తులసి, ఎస్ చెంగల్ రాజు, జెఎసి నాయకులు, తాతంశెట్టి నాగేంద్ర, డాక్టర్ సయ్యద్ అహ్మద్, పి నవీన్, ఎన్.హేమరాజ్, కుప్పాల జ్యోతి, సుమన్, అమర్, సుబ్బారావు, ముత్యాల కిషోర్, గడ్డం చంగల్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని కొత్తబజార్, గాంధీనగర్‌లోని విజ్‌డమ్ సిబిఎస్ఇ విద్యాసంస్థలలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను చైర్మన్ డాక్టర్ ప్రదీప్, అడ్మిన్ డైరెక్టర్ టి. మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు సురేష్ బాబు, సుందర్ బాబు హాజరయ్యారు. వారు విద్యార్థులకు క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యతను వివరించారు. ఏసుక్రీస్తు బోధనలు, సత్యం, ప్రేమ,శాంతి, సహనం గురించి చైర్మన్ డాక్టర్ ప్రదీప్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి. ప్రియాంక, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రతి ఏడాది డిసెంబర్ 25న నిర్వహించుకోనున్న క్రిస్మస్ వేడుకలను మండలంలోని నూలివీడులలోని టౌన్ చర్చి, ఐఎఫ్‌సిఎం చర్చ్, కర్మెలు ప్రార్థన మందిరం చర్చిలు బుధవారం అలంకరించారు. చుట్టూ రంగులు వల్లులు వాక్యాలు రాసిపెట్టి క్రిస్మస్ చెట్టు, స్టార్ల విద్యుత్ లైటు సెట్టింగ్ కలర్ పేపర్ల ద్వారా అలంకరించారు. గురువారం ఉదయం ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. **కలికిరి:** మండలంలోని కె.రెడ్డివారిపల్లిలోని తపస్య, కలకడ రోడ్డులోని ఆదిస్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రామానుజులు నాయుడు, క్యాంపస్ ఇన్‌ఛార్జి శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఆదినారాయణరెడ్డి పిల్లలతో కలిసి క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, ప్రేమలత, ఉపాధ్యాయులు విద్యార్థులందరూ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** వెలుగు సంస్థ సేవ సదన్‌లో వికలాంగులు, వృద్ధులు వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, యేసుక్రీస్తు జననం, క్రిస్మస్ ప్రత్యేకతను చిన్నారులు, వృద్ధులకు వివరించారు. వార్డెన్ స్వీటీ, ఎఎన్ఎం గీతాంజలి, అనుపమ కలసి ప్రత్యేక పాటలతో శ్రోతులను అలరించారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఈసీ మెంబర్ సుజాత, సోషల్ వర్కర్ గీత, వృద్ధులు, చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఆర్ఎస్ రోడ్డు లోని ఆర్ సి ఎం చర్చ్ క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయింది. చర్చిని విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు.రాత్రి 11 గంటల నుండి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. బాల యేసును అత్యంత సుందరంగా అలంకరించిన పశువుల పాకలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలను ప్రారంభిస్తారు.

నందలూరు : విద్యుత్ కాంతులతో ఆర్‌సిఎం చర్చి

మహారాజశ్రీ (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి కోర్టులో

I.A.No :168/2025
O.S.No : 87/2025

1.షేక్ షబానా, D/o రామాపురం ఖాదర్ బాష, వయస్సు 47 సం.,
2.షేక్ సలీం, S/o రామాపురం ఖాదర్ బాష, వయస్సు 42 సం., పర్మినెంట్ నివాసం. D.NO:6/1909-J, R.S. రోడ్డు, రాజంపేట టౌన్, పోస్టు & మండలం, అన్నమయ్య జిల్లా.
...పిటీషనర్లు

V/S

షేక్ సర్వరున్నీసా, W/o.లేట్ రామాపురం ఖాదర్ బాష, ప్రస్తుత నివాసం. 4.వ వార్డు, DBN పల్లి, బి.ఎస్ సినిమా హాల్ దగ్గర, D.NO.:4/515,రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. **...రెస్పాండెంట్**

నోటీసు

పై తెలిపిన పిటీషనర్లు మీ పైన U/O 39 Rule 1 and 2 of cpc పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీకేమైనా ఆక్షేపణలు ఉన్నయెడల ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ 31.12.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలయును. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//By Order of the Court//
S.M.D. HABIBULLAH,
అడ్వకేట్,
రాజంపేట, 516115, మొబైల్ : 94409 41506.

మహారాజశ్రీ (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జి కోర్టులో

O.S.No : 87/2025

1.షేక్ షబానా, D/o రామాపురం ఖాదర్ బాష, వయస్సు 47 సం.,
2.షేక్ సలీం, S/o రామాపురం ఖాదర్ బాష, వయస్సు 42 సం., పర్మినెంట్ నివాసం. D.NO:6/1909-J, R.S. రోడ్డు, రాజంపేట టౌన్, పోస్టు & మండలం, అన్నమయ్య జిల్లా.
...వాదులు

V/S

షేక్ సర్వరున్నీసా, W/o.లేట్ రామాపురం ఖాదర్ బాష, ప్రస్తుత నివాసం. 4.వ వార్డు, DBN పల్లి, బి.ఎస్ సినిమా హాల్ దగ్గర, D.NO.:4/515,రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. **...ప్రతివాది**

దావా సమను

పై తెలిపిన వాదులు మీ పైన specific performance దావా దాఖలు చేసియున్నారు. మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ 31.12.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలయును. లేనంతట మీ పరోక్షమందు తీర్మానించబడును.

//By Order of the Court//
S.M.D. HABIBULLAH,
అడ్వకేట్,
రాజంపేట, 516115, మొబైల్ : 94409 41506.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) రాజంపేట వారి కోర్టు నందు

O.S.No :141/2023

గుమ్మల పవనకుమారి. **...వాది**

V/S

D2. కొమ్మిరెడ్డి సాయి తేజరెడ్డి, S/o లేట్ బలరామిరెడ్డి, R/at దేవ మాచుపల్లి గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.
D4. నూక రమణ రెడ్డి, S/o చిన్నపురెడ్డి, R/at. దేవమాచుపల్లి గ్రామం, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా.
...ప్రతివాదులు 2 మరియు 4

దావా సమను

పై కనబరిచిన వాది, ప్రతివాదులు అయిన మీపైన పర్మినెంట్ ఇంజక్షన్ కోరుతూ పై కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాదులు 2 మరియు 4 అయిన మీయొక్క హాజరు నిమిత్తం 29.12.2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉన్నది కనుక పై తేదీన, పై కోర్టు నందు మీరు స్వయంగా గానీ, మీయొక్క వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షముందు తీర్మానించబడును.

//By Order of the Court//
పి.సురేష్ కుమార్,
వాది తరుపున న్యాయవాది, రాజంపేట.

మార్కెట్ యార్డులో పర్యటిస్తున్న విజయ సునీత

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తేనే అభివృద్ధి

- వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ విజయసునీత

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తేనే మార్కెట్‌తో పాటు వేలమంది రైతులు అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందని అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత అన్నారు. బుధవారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌ను ఆమె సందర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లతో కలిసి మార్కెట్ యార్డ్‌లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిఫాం మార్కెట్‌ను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి షాపింగ్ కాంప్లెక్స్ రూములు, షెడ్లు రైతులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. చైర్మన్ చెంగాల శివరాం నేతృత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని డిఎస్‌పి మహేంద్ర పేర్కొన్నారు. బుధవారం మదనపల్లి-I టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ముందుగా డిఎస్‌పికి సిఐ మహమ్మద్ రఫీ, ఎస్.ఐ అన్సర్ బాషా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను నియంత్రించాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'ని భ్రష్టుపట్టిస్తున్న ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను కూటమి పాలకులు భ్రష్టుపట్టిస్తున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలు, కూలీలు వలసలు వెళ్ళ కుండా వారికి ఉపాధిని కల్పించేందుకు 2006లో అప్పటి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పథకం ద్వారా గత 19 సంవత్స రాలుగా రాష్ట్రంలోని కూలీలకు రెండు లక్షల కోట్లకు పైగా లబ్ధిచేకూరడం జరిగిందన్నారు. పథకం కింద గ్రామాలలో నిర్మించిన సిసిరోడ్లు, మురుగునీటి కాలువలు, భవనాలు పేదరికాన్ని నిర్మూలించడంలో కీలక పాత్రను పోషించా యన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత ఉపాధి పథకాన్ని సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందంటే గత ప్రభుత్వాలు చేసిన క-షే అన్నారు. 12 ఏళ్ళ మోడీ పాలనలో అభివృద్ధి చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థల న్నింటిని ప్రయివేటుపరం చేస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో కూటిమి ప్రభుత్వం తాను చేసిన అవినీత,అక్రమాలకు కప్పి పుచ్చు కునేందుకు గతంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తూ ముందుకు సాగుతోందంటూ చెప్పారు. అధికాం పార్టీ నేతలు తామేదో గొప్పవారం అన్నట్లు తాటతీస్తాం, తోలు తీస్తామంటూ ఫోజులు కొట్టడం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అప్పుల మీద అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైసిపి నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్, సుగవాసి ఈశ్వర్, షబ్బీర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిందితుడు, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

తమిళ కూలీ అరెస్టు : రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని గువ్వలచెరువు తూర్పు బీట్‌లోని వేపమాను బోటు ప్రదేశంలో బుధవారం తమిళ కూలీ, రెండు ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు రాయచోటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జె.మదన్మోహన్ తెలిపారు. పాలకొండలోని గువ్వలచెరువు తూర్పు బీట్‌లో ఎర్రచందనం తరలిస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారికి ముందస్తు సమాచారం రావడంతో కుంబింగ్ నిర్వహి స్తుండగా గువ్వల చెరువు తూర్పు బీట్ పరిధిలోని వేపమాను బోటు ప్రాంతంలో ఏడుగురు తమిళ కూలీలు ఎర్రచందనం చెట్లు నరుకుతుండగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జి.భరణి, బీట్ ఆఫీసర్లు రఘుపతి, రాజు రెడ్డప్ప ఆధ్వర్యంలో తమ సిబ్బంది చుట్టుముట్టుగా ఆరుగురు కూలీలు పారిపోయారని పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం పోలూరు తాలూకా అన్న నగర్‌కు చెందిన కన్నభిరాన్ అనే తమిళ కూలీని పట్టుకుని రెండు దుంగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టుబడి దుంగల బరువు 47 కిలోలు అని, రూ. 25 వేలు విలువ చేస్తుందని చెప్పారు. తప్పించుకున్న ఆరుగురి ఆచూకీ కోసం వెదుకుతున్నామని తెలిపారు. పట్టుబడిన ముద్దాయిని రెడ్ శాండిల్ కోర్టుకు తరలించినట్లు వివరించారు. ఈ కుంబింగ్ ఆపరేషన్‌లో అధికారులతో పాటు ప్రొటెక్షన్ వాచర్ రెడ్డయ్య, సుబ్బారెడ్డి, పెద్దరెడ్డయ్య, శీను, రమణ, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, జయరాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తీవ్రంగా గాయపడిన ప్రభావతి

తీవ్రంగా గాయపడిన చిరంజీవి

రోడ్డు ప్రమాదంలో అన్నా చెల్లెలకు గాయాలైన సంఘటన మండలంలోని అయ్యావారిపల్లి సమీపంలో బుధవారం చోటు చేసుకొంది. పుంగనూరుకు చెందిన చిరంజీవి తన చెల్లెలు ప్రభావతిని క్రిస్మస్ పండుగకు తన ఊరికి పిల్చుకొని వెళ్లేందుకు వాల్మీకిపురం మండలం దిగువబూడిదవేడుకు స్కూటీపై వచ్చాడు. ఇక్కడ నుండి స్కూటీపై చిరంజీవి, తన చెల్లెలు ప్రభావతి, మేనల్లుడు సంతోష్ కుమార్‌ను పిల్చుకొని వెళ్తుండగా మార్గమధ్యంలోని అయ్యవారిపల్లి సమీపంలో స్కూటీకి అడ్డంగా కుక్క దూరడంతో స్కూటీని కంట్రోల్ చేయలేక కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో చిరంజీవి, ప్రభావతికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆటోలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.